

విద్యాశాఖలో జోష్

సంస్కరణల దిశగా కసరత్తు

ఇంటర్‌కూ స్టూడెంట్ కిట్లు

బాలికలకు మళ్లీ సైకిళ్లు ?

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 19 : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరిన నేపథ్యంలో పాఠశాల విద్యలో పలు సంస్కరణలు అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ ఈనెల 21న పదవీ బాధ్యతలు చేపట్టే నాటికి కూటమి ప్రభుత్వం ప్రాధామ్యాల కనుగుణంగా నూతన ప్రతిపాదనలకు సిద్ధమవు తున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో భ్రష్టు పట్టిన విద్యాశాఖను ప్రక్షాళన చేసి నూతనోత్తేజంతో నింపేందుకు అడుగులు వేగవంత మయ్యాయి. ఇందులో భాగంగా స్కూలు విద్యార్థు లకు ఇస్తున్నట్టుగానే ఇంటర్మీడియట్ చదువు తున్న బాల బాలికలకు కిట్‌లను పంపిణీ చేయడానికి నిర్ణయించింది.జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరం 914 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 732 విద్యార్థులు విద్యనభ్యసించారు. 2024-25 విద్యా సంవత్సరంలో సుమారు రెండు వేల మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉంటారు. వీరందికీ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగులను అందజేయాలని సమగ్ర శిక్ష జిల్లా అధికారులకు బుధవారం ఆ శాఖ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. జూలై 15లోగా పూర్తిస్థాయిలో విద్యార్థులం దరికీ అందేలా జిల్లాలోని మండల రిసోర్స్ సెంటర్లకు సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు.

హాస్టల్, ప్లస్‌టూ విద్యార్థులకూ..

మరోవైపు సంక్షేమ వసతి గృహాల కళాశాలలు, కేజీబీవీలు, మోడల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న బాలబాలికలకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేసేందుకు వీలుగా ఇండెంట్‌లను వెంటనే పంపాలని సంబంధిత విభాగాల జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయగా తర్వాత గద్దెనెక్కిన వైసీపీ ప్రభుత్వం వీటిని నిలిపివేసింది. ఐదేళ్ల తర్వాత మళ్ళీ ఇప్పుడు ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటే బ్యాగులు,నోట్ పుస్తకాలను అందజేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయిం చడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్లస్‌టూ పాఠశాలలో చదివే జూనియర్, సీనియర్ విద్యార్థినులకు వీటిని అందించనున్నారు. జిల్లాలో 16 ప్లస్‌టూ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో గత ఏడాది 306 విద్యార్థులు విద్యనభ్యసించారు.

సైకిళ్ల పంపిణీపై ఆరా ?

టీడీపీ ప్రభుత్వ పాలనలో బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9 తరగతులు చదివే బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసిన విషయం విధితమే. అధికారంలోకి వచ్చిన వైసీపీ 2019లో సైకిళ్ల పంపిణీని నిలిపివేయగా పలుచోట్ల సరఫరా చేయకుండా మూలన పడేయ డంతో చాలావరకు తుప్పుపట్టాయి. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సైకిళ్లపై తొలిసారిగా బుధవారం దృష్టి సారించింది. చివరిసారిగా 2018లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సరఫరా చేసిన 34,370 సైకిళ్లు పూర్తిగా అందజేశారా.. లేక పంపిణీ చేయకుండా ఎన్ని సైకిళ్లు పాఠశాలల్లో నిల్వ ఉంచారనే విషయాలపై తక్షణమే సమాచారం పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.నూతన ప్రభుత్వం మళ్లీ సైకిళ్ల పంపిణీకి యోచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.


బదిలీల గుబులు

సిఫారసుల కోసం ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ

జిల్లా నుంచి మండల స్థాయి అధికారుల వరకు ప్రయత్నాలు

వైసీపీ హయాంలో ఇబ్బంది పెట్టిన వారికి నో ఛాన్స్

పరిస్థితులను బేరీజు వేసుకుంటున్న కూటమి నేతలు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

అధికారుల్లో బదిలీల గుబులు నెలకొంది. జిల్లా స్థాయి అధికారుల నుంచి మండలంలో పని చేస్తున్న అధికారుల వరకు ఎవరు ఉంటారో.. ఎవరికి స్థానచలనం కలుగుతుందో నన్న చర్చ సాగుతోంది. ఎన్నికల ముందే జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని బదిలీ చేశారు. కొత్త కలెక్టర్‌గా సుమిత్ కుమార్‌ను నియమించారు. జిల్లా ఎస్పీగా పనిచేసిన రవిప్రకాష్ బదిలీపై వెళ్లిపోయారు.ఆయన స్థానంలో అజిత వేజెండ్ల బాధ్యతలు చేపట్టారు. మరోవైపు ఎన్నికల ముందు జిల్లాలో స్థానికంగా ఉన్న అధికా రులను కూడా బదిలీపై పంపారు. వారంతా ఇప్పుడు మళ్లీ సొంత జిల్లాకు రావడానికి పావులు కదుపుతున్నారు.రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లోనే సిఫారసుల కోసం నేతల చుట్టూ తిరుగుతున్నారు. అదే వరుసలో పోలీస్ అధికారులు కూడా ఉన్నారు. మండల స్థాయి నాయకులను కలుసుకుని ఎమ్మెల్యేల వద్దకు వెళుతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అతిగా వ్యవహరించిన వారంతా ఇప్పుడు క్షేత్రస్థాయిలో నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేసుకుంటు న్నారు. అయితే జిల్లాలో తెలుగుదేశం, జనసేన కూటమికి వ్యతిరేకంగా వ్యవహరించిన వారికి చోటు ఇవ్వకూడదని నాయకులు ఒక అభిప్రాయానికి వచ్చారు.అవసరమైతే అధిష్ఠానం దృష్టికి కూడా సంబంధిత అధికారుల వివరాలను అందజేయాలని చూస్తున్నారు. మొత్తంపైన ప్రభుత్వం మారి పోవడంతో అధికారుల్లో బదిలీలపై చర్చ నడుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో అధికారులను బదిలీ చేశారు. కొందరిపై వేటు పడింది. జిల్లా, మండల స్థాయిలోనూ ఇదే పంథా కొనసాగనుంది. ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ఈ విషయంలో ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నారు.కూటమికి, ప్రజలకు అనుకూలంగా ఉండే అధికారులను రప్పించు కోవాలన్న తలంపుతో ఉన్నారు. అయితే పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల్లో మార్పులు అధికంగా చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్న క్యాంటీన్లపై ఆరా?

పరిస్థితులపై నివేదిక కోరిన ప్రభుత్వం

మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చెయ్యాలని ఆదేశం



భీమవరం పాత బస్టాండ్ సమీపంలో క్యాంటీన్

భీమవరం టౌన్, జూన్ 19 : అన్న క్యాంటీన్‌లకు ఒక రూపం ఇచ్చి తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా మునిసిపాల్టీల నుంచి నివేదికలను రప్పిం చుకుంటోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేసిన వెంటనే మునిసిపల్ ఉన్నతాధికారులు ఆఘమేఘాలమీద వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వం కోరిన 23 అంశాలను పూర్తిచేసిన నివేది కలు మునిసిపాల్టీల వారీగా ఉన్నతాధికారులకు చేరుకున్నాయి. జిల్లాకు సంబంధించి ఐదు మునిసి పాల్టీల్లో 9 అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లు మూసివేశారు. కొన్నింటిని సచివాలయాలుగాను, కొన్నింటిని ఇతర శాఖల కార్యాలయాలుగా మార్చి వేశారు. భీమవరం ముని సిపాల్టీకి సంబంధించి మూడు క్యాంటీన్లు ఉండగా వాటిని వార్డు సచివాలయాలుగా వినియోగిస్తు న్నారు. తాడేపల్లిగూడెంలోను 3 క్యాంటీన్లు ఉండగా రెండు సచివాలయాలుగా మార్చగా ఒకటి ఖాళీగా ఉంది. నరసాపురంలో పోలీస్ స్టేషన్‌గా మార్చివేసి వినియోగిస్తున్నారు. తణుకు, పాలకొల్లు మునిసిపా ల్టీల్లో క్యాంటీన్లను మూసి వేశారు.

క్యాంటీన్ భవనాల పరిస్థితి ఏంటి ?

అన్న క్యాంటీన్లకు సంబంధించి ప్రభుత్వం భవనాల పరిస్థితిపై 23 అంశాలను పొందుపరుస్తూ నివేదిక కోరింది. మునిసిపాలిటీ, గతంలో మంజూరు చేసిన క్యాంటీన్‌లు ఎన్ని, ప్రసుత్తం వినియోగంలో ఉన్నాయా.. లేదా ?ఖాళీగా ఉన్నాయా ? దేనికి వినియోగిస్తున్నారు..వాటర్ కనెక్షన్ ఉందా, మరుగు దొడ్లు ఉన్నాయా, వాష్ బేసిన్, ఫర్నీచర్ , ఎల్ఈడీ టీవీ, సీసీ కెమెరాలు, ఎలక్ట్రానిక్ టోకెన్ మిషన్, వేయింగ్ మిషన్, వెబ్ కెమెరా, తదితర అంశాలపై వివరాలను అడిగారు. వాటిని ఒక ప్రోఫార్మా ద్వారా అధికారులు రూపొందించారు. జిల్లాలోని 5 మునిసి పాల్టీల నుంచి నివేదికలను సిద్ధం చేసి పంపించారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

ప్రస్తుతం అన్న క్యాంటీన్‌లలో మరమ్మతులు, ఇతర అవసరమైన వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్ని నిధులు కావాలో లెక్కలు సిద్ధం చెయ్యాలని అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. దీంతో జిల్లాలోని మునిసిపల్ అధికారులు యుద్ధప్రాతిపదిక ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వెంటనే మరమ్మతులు పూర్తిచేసి క్యాంటీన్‌లను వి నియోగంలోకి తీసుకువస్తారు. జిల్లాలోని తణుకు, పాలకొల్లుతాడేపల్లిగూడెం మునిసిపాల్టీలలో మూడు అన్నా క్యాంటీన్లు ఇతర వాటికి ఉపయోగించకుండా ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రారంభించాలను కుంటే ఈ మూడు చోట్ల వెంటనే సిద్ధం చేయవచ్చు.



ఆగర్తిపాలెంలో డ్రెయిన్, పంట కాల్వలను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

జగన్‌కు అధికారమే తప్ప.. సేవపై ధ్యాస లేదు

» డ్రెయిన్లు, పంట కాల్వల ప్రక్షాళన పనులు చేపట్టాలి

» అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

పాలకొల్లు టౌన్, జూన్ 19 : జగన్‌కు అధికార దాహం తప్ప రైతులకు సేవ చేసే ధ్యాస లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఇరిగేషన్, డ్రెయినేజీ, కన్జర్వేన్సీ శాఖల పనితీరుపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వర్షాకాలంలో వ్యవసాయం ముంపు బారిన పడకుండా పంట కాల్వలు, మురుగు డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులు యుద్ధప్రాతిపదిక చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పరివాహక గ్రామాల్లో బలహీనంగా ఉన్న ఏటిగట్ల పటిష్టతకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంట కాల్వలు, మురుగు డ్రెయిన్లు, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను గాలికొ దిలేసిందన్నారు. అన్నదాతను నిర్లక్ష్యం, దగా చేసినందువల్లే జగన్‌కు పకృతి శపించి పదకొండు సీట్లకే పరిమితం చేసిందన్నారు. సమావేశంలో ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్, ఈఈ ఎం.దక్షిణమూర్తి, డీఈలు శ్రీనివాసు, సత్యనారాయణ, ఏఈలు బి.మోహన్‌కృష్ణ, జి.జయశంకర్, కె.శ్రీనివాసు, దుర్గారావు, రమణారావు, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆగర్తిపాలెం ప్రాంతంలో తూడు, గుర్రపు డెక్క దట్టంగా పేరుకుపోయిన డ్రెయిన్లు, పంట కాల్వలను ఆయన పరిశీలించారు. మంత్రి వెంట నాయకులు, రైతులు ఉన్నారు.

పెద్దింట్లమ్మ హుండీ ఆదాయం రూ.7.63 లక్షలు



ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కైకలూరు, జూన్ 19: కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయంలో బుధవారం హుండీలను లెక్కించగా 7 లక్షల 63 వేల 447 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు తెలిపారు. బుధవారం ఎండోమెంట్ తనిఖీ అధికారి వి. సుదాకర్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపును నిర్వహించారు. 62 రోజులకు ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో కొబ్బరి చెక్కలను పోగుచేసుకునే హక్కు కోసం వేలం నిర్వహించగా పాటదారులు ఎవరూ పాల్గొనకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.

ఆ పోలీసులపై చర్యలు చేపట్టండి..



హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

నూజివీడు టౌన్, జూన్ 19: గత ప్రభుత్వం హయాంలో రైతులపై అక్రమ కేసులు పెట్టిన పోలీసులపై చర్య తీసుకోవాలని జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ కోరారు. బుధవారం అమరావతి సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనితను కలసిన ఆయన మల్లవల్లి ఇండస్ట్రీయల్ కారిడార్ భూ నిర్వాసిత రైతుల విషయమై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రైతులపై లాఠీచార్జ్ చేసి గాయపరిచి, అక్రమంగా హత్యా కేసులు నమోదు చేశారని, ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకో వాలని కోరారు. జనసేన నాయకుడు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో హోటళ్ల యజమానులకు టోకరా

మొగల్తూరు, జూన్ 19 : ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌నంటూ ఒక వ్యక్తి హోటల్ యజమానులకు టోకరా వేసిన ఘటన మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో జరిగింది. స్థానికంగా కట్టా త్రిమూర్తులు వినాయక రెస్టారెంట్‌ను, ఆయన కుమారుడు నాని అమ్మ టిఫిన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. ఆ హోటల్స్‌కు ఈనెల 16వ తేదీన ఓ వ్యక్తి వచ్చి తాను ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను, హోటల్‌లో పరిశుభ్రత లేదు. మీ హోటల్స్‌పై కేసు నమోదు చేస్తాం లేకుంటే జరిమానా చెల్లిస్తే సరిపోతోంది. ఈమేరకు రసీదు కూడా ఇస్తామని నమ్మబలికాడు. వ్యాపార సమయం కావడంతో వారు జరిమానా చెల్లిస్తానని చెప్పడంతో ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.రూ.1416 చొప్పున చెల్లించడంతో సదరు వ్యక్తి తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన ఇండియన్ ఫుడ్ సొల్యూషన్స్ సంస్థకు చెందిన రసీదు ఇచ్చి ఉడాయించాడు. ఆదే సమయంలో హోటల్‌కు వచ్చి ఒక కస్టమర్ అతడు మోసగాడు అని కొత్తోట ప్రాంతానికి చెందిన వాడని నిరంతరం చిరు వ్యాపారులు, గల్ఫ్ వెళ్ళే వారిని మోసం చేసే వ్యక్తి అని యజమానులకు చెప్పడంతో వారు ఈ విషయాన్ని బుధవారం మొగల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విధి నిర్వహణలో తపాలా ఉద్యోగి మృతి

ఆకివీడు, జూన్ 19: విధి నిర్వహణలో వున్న తపాలాఉద్యోగి మరణించాడు. కోళ్ళపర్రు పోస్టాఫీసులో పనిచేస్తున్న తపాలా ఉద్యోగి ఎం.నూకన్న దొర(51) బుధవారం విధులు నిర్వర్తిస్తుండగా రక్తం కక్కుకుని చనిపోయాడు. ఆయనది రంపచోడవరం స్వగ్రామం కాగా సుమారు ఇరవై ఎనిమిదేళ్ళ నుంచి కోళ్ళపర్రులోనే ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇటీవల ఆయన అనారోగ్యం బారిన పడ్డారని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని సహోద్యోగులు చెబుతున్నారు. పోస్టాఫీసు సిబ్బంది నివాళులర్పించి సంతాపం తెలిపారు

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవాన్ని పరిశీలిస్తున్న సిద్ధాంతం గ్రామస్థులు

పెనుగొండ, జూన్ 19 : సిద్ధాంతం వశిష్ట గోదావరి తీరాన కేదారేశ్వర స్వామి ఆలయం వద్ద గత నాలుగు నెలలుగా సుమారు 50 ఏళ్ల వయస్సున్న ఓ మహిళ ఉంటుందని స్థానికులు తెలిపారు. ఆ మహిళకు పక్షవాతం ఉండడంతో మాటలు సరిగ్గా చెప్పలేకపోవడంతో ఆమె వివరాలు స్థానిక అధికారులు సేకరించలేకపోయారు. బుధవారం తెల్లవారుజామున ఆమె మరణించడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సర్పంచ్ చింతపల్లి గనిరాజు ఘటన స్థలానికి తన సిబ్బందితో వెళ్లి పరిశీలించి కొంతమంది వార్డు సభ్యులతో కలిసి అనాథ శవానికి అంతిమ సంస్కారాలు పూర్తి చేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నక్కా సత్యనారాయణ, అంజూరి శ్రీను, ఆకుల వీర్రాజు, తదితరులు ఉన్నారు.

నామాల వాడా నిన్నొదలా..





శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల, జూన్ 19: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 16 మంది ధర్మకర్తలతో కొలువుతీరిన ట్రస్టు బోర్డులో 14 మంది సభ్యులు ఆ నామాలవాడిని వదలలేకపోతున్నారు. గత ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు పొందిన వీరు.. ప్రభుత్వం మారినా వైదొలగడం లేదు. వైసీపీ హయాంలో నామినేటెడ్ పదవులు పొందిన పలువురు స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నారు. వైసీపీ హయాంలో శ్రీవారి దేవస్థానానికి రెండుసార్లు పాలకమండలి నియామకాలు జరిగాయి. 14 మంది సభ్యులతో 2011లో తొలిసారిగా ఏర్పాటైన ట్రస్టుబోర్డు 2013 వరకు కొనసాగింది. ఆ తరువాత చట్టపరిధిలోని అంశాలకు లోబడి అప్పడి ప్రభుత్వం ఐదేళ్లపాటు ట్రస్టుబోర్డు నియామకం జరుగకుండా మినహాయింపునిచ్చింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొదటిసారి 2020 ఫిబ్రవరి 20న శ్రీవారి దేవస్థానానికి ట్రస్టుబోర్డును నియమిస్తూ అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్లపాటు వారు విధులు నిర్వర్తించారు. తర్వాత నియామకాలు జరుగకపోవడంతో ఆ బోర్డు పదవీకాలాన్ని పొడిగించారు. ప్రస్తుతం ఉన్న పాలక మండలి 2023 ఫిబ్రవరి 9న పాలకమండలి చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త రాజా ఎస్వీ సుధాకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడైన

రాజీనామా ఊసెత్తని నామినేటెడ్ సభ్యులు

» ఆలయ చైర్మన్, ఎక్స్‌అఫీషియోలకు మినహాయింపు

ఆలయ ప్రధాన అర్చకులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులుతో కలసి మొత్తం 16 మంది పదవీ ప్రమాణస్వీకారం చేశారు. వీరికి 2025 ఫిబ్రవరి 8 వరకు గడువు ఉంది.

ఆధ్యాత్మికతను మరచిన కొందరు వైసీపీ నేతలు..

దేవదాయ చట్టం సెక్షన్ 18 ప్రకారం దేవాలయానికి ఒక వ్యక్తి ట్రస్ట్ బోర్డు సభ్యునిగా నియమితులయ్యేందుకు గాను అతడికి దేవుని పట్ల విశ్వాసం, నమ్మకముండాలి. సదరు వ్యక్తికి మంచినడవడిక, కీర్తి కల్గి ఉండాలి. దేవాలయాలను అభివృద్ధి చేయగలవాడై ఉండాలి. దేవాలయాల వ్యవహారాలను చూసే సమయం కలిగి ఉండాలి. అతడిపై క్రిమినల్ కేసులుండకూడదు. అయితే ఎంతో పవిత్రమైన ఈ దేవాలయ ప్రాంగణంలో చెప్పులు వేసుకుని తిరిగిన చరిత్ర 2020లో వేసిన ట్రస్టు బోర్డులోని ఓ సభ్యునిది. తమకు, లేదా తాము చెప్పిన వారికి దర్శనం చేయించలేదనే కారణంతో తాము రాజీనామా చేస్తామని బెదిరింపులు.. ఆలయ అధికారులకు డ్యూటీలు మార్పించిన ఘనత ఇప్పటి కొందరు పాలకమండలి సభ్యులది. శేషాచలంపైనే పార్టీలో జాయినింగ్‌లు, తాము ద్వారకాతిరుమలకు వచ్చామని తెలిసినా.. మండపానికి వచ్చేవరకూ వేచిచూడకుండా శ్రీవారి కల్యాణతంతును జరిపేయడం ఏమిటని మాజీ ఎంపీ మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అప్పట్లో చిందులు తొక్కారు. ట్రస్టీలు, అధికారులు, అర్చకులతో క్షమాపణ చెప్పించుకుని మరీ వారు కల్యాణానికి హాజరైన వైనాన్ని ఇక్కడి వారు ఇంకా మర్చిపోలేదు. శేషాచలంపై పార్టీ జెండాలతో తిరగడమే కాకుండా ఏకంగా నాన్‌వెజ్ భోజనాలు పెట్టేశారు. ఇలా గత ప్రభుత్వ హయాంలో ఆలయం అంటే ఆధ్యాత్మికత అని మర్చిపోయారు. గత పాలకమండలిలో నియమితులైన ఓ వ్యక్తి ఇది తన హోదాకు తగినది కాదని రాజీనామా చేశారు. అతని స్థానంలో మరొకరిని నియమించారు. ఇటువంటివి ఎన్నో వైసీపీ హయాంలో జరిగాయి. ఇప్పటికైనా నూతన కూటమి ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకుని ఆలయ మర్యాదలను కాపాడుతూ భక్తి భావం, దైవచింతన కల్గిన వారినే పాలకమండలి సభ్యులుగా కొత్తగా ఎంపిక చేయాలని పలువురు కోరుతున్నారు.

రాజీనామా చేయాల్సిందేనా !

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక కొత్తప్రభుత్వం కొలువు తీరకముందే సీఎం కార్యాలయం నుంచి నామినేటెడ్ పోస్టులను రద్దు చేస్తున్నట్టు ఉత్తర్వులు వచ్చాయి. అవి ఇంకా సంబంధిత కార్యాలయాలకు చేరలేదని సమాచారం. ప్రభుత్వం మారినందున వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వారంతా ఉత్తర్వులు వెలుబడిన వెంటనే రాజీనామా చేయాల్సిందే. ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న అనువంశిక ధర్మకర్తకు, ఎక్స్‌అఫీషియో సభ్యునికి రాజీనామా చేయాల్సిన అవసరం వర్తించదు. కూటమి ప్రభుత్వ కూర్పుతో నూతన పాలకమండలిలో చోటు కోసం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభమ య్యాయి. ప్రభుత్వం మారింది కనుక ప్రస్తుత పాలకమండలి సభ్యులు స్వచ్ఛందంగా తప్పుకుంటారా.. లేక ఉత్తర్వులు వెలుబడాల్సిందేనా అనేది వేచి చూడాలి.

ప్రజాచైతన్యంతోనే కూటమి అఖండ విజయం

» రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంత్రి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూన్ 19 : 'ప్రజా చైతన్యంతోనే కూటమి అఖండ విజయం సాధించింది. ప్రజా తీర్పుగా భావిస్తున్నాం.. పేదల సంక్షేమం, విద్య వ్యవసాయ, పరిశ్రమ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తాం. రాష్ట్ర ప్రజలు కోరుకున్న మార్పుకు అనుగుణంగా నిజాయతీగా చట్టప్రకారం కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతాం.. గాడి తప్పిన వ్యవస్థలను సక్రమ విధానాల్లోకి సీఎం చంద్రబాబు నాయుడు తీసుకువస్తారు' అని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని సరిపిడకల రామారావు నివాసానికి బుధవారం విచ్చేసిన మంత్రి శ్రీనివాస్, లక్ష్మి సింధు దంపతులను పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ, హౌసింగ్ బోర్డు డెవలప్‌మెంట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సభకు మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ యువతకే ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబు అభినందనీయులని, రాష్ట్రాభివృద్ధికి అందరూ కలిసి పని చేద్దామన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, జనపాటి మధు, జి.మల్లేశ్వరరావు, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు సరిపిడకల రామారావు, ఎం.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి..

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించడం తల్లిదండ్రుల సామాజిక బాధ్యతగా బడిలో చేర్పించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ బడికి పోదాం రా' .. కార్యక్రమ బ్రోచర్‌ను శ్రీ విజ్ఞానవేదిక, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన బడికి పోదాంరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరంలో డ్రాపట్స్ బాలబాలికలను గుర్తించి బడిలో చేర్పించడం కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహిస్తామన్నారు. మంత్రి శ్రీనివాస్ స్ఫూర్తితో పీఎస్ఎం హైస్కూల్లో గీతా సహన్ అనే బాలికను ఎనిమిదో తరగతిలో చేర్పించి నోట్ పుస్తకాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, రోటరీ క్లబ్ నాయకులు షేక్ బాబాజీ సాహెబ్, నరహరిశెట్టి కృష్ణ, ఎంఈవో జి.శ్రీనివాస్, ఎ.ప్రకాశ్, వడుపు గోపి తదితరులు పాల్గొన్నారు.

అపరాధ రుసుం లేకుండా అదనపు పొగాకు అమ్ముకుంటాం

» పొగాకు బోర్డు చైర్మన్‌కు రైతు సంఘం నాయకుల వినతి



పొగాకు బోర్డు చైర్మన్ శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం, జూన్ 19 : ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు పొగాకు వేలం కేంద్రాల పరిధిలో అదనంగా పండించిన పొగాకును అపరాధ రుసుం లేకుండా వేలం కేంద్రాల్లో అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని రైతు సంఘ నాయకులు, రైతులు కోరారు. బుధవారం బుధవారం గుంటూరులోని పొగాకు బోర్డు ఛైర్మన్ అద్దంకి శ్రీదర్‌బాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయంపై ఢిల్లీలోని వాణిజ్య శాఖకు సిఫారసు చేశానని చెప్పారని రైతు సంఘం నాయకుడు పరిమి రాంబాబు పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం పట్టణంలోని రెండు వేలం కేంద్రాలకు ఒక కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఛైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. రైతు సంఘం నాయకులు, రైతులు వీవీఎస్ ప్రకాశరావు, కరాటం రెడ్డిబాబు, కూచిపూడి రమేష్, అట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, కాకర్ల వివేకానంద, అడపా సత్యనారాయణ, ఇల్లూరి రాంబాబు, గద్దే శేషగిరిరావు, పిన్నమనేని మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు విద్యుత్ ఉపకరణాలు దగ్ధం

మొగల్తూరు, జూన్ 19: మొగల్తూరు పంచాయతీ పరిధి అగ్రహారంలో బుధవారం వేకువజామున పిడుగు పాటుకు కొబ్బరి చెట్టు ఆహుతి కాగా ఆ ప్రాంతంలోని నివాసాల్లో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. అగ్రహారంలోని పోతురెడ్డి నాయుడు ఇంటి సమీపంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడడంతో పెద్ద మంటలు, శబ్దాలు చెలరేగాయి. చెట్టు పూర్తిగా దగ్ధం కాగా ఆ ప్రాంతంలోని నాయుడు ఇంటితో పాటు పలువురి గృహాల్లో ఫ్యాన్‌లు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీ, ఇన్వర్టర్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనపై బాధితులు విద్యుత్, రెవెన్యూ అధికారులుకు ఫిర్యాదు చేయగా సిబ్బంది దగ్ధమైన వాటిని పరిశీలించారు.

నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరు క్రైం, జూన్ 19:రాత్రివేళ ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకు పారిపోయారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రులోని గీతా కాలనీలో నివాసం ఉంటున్న డి.రమాదేవి ఇంటి ఆరుబయట రాత్రివేళ నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని రెండు కాసుల బంగారు గొలుసును తెంపుకు పారిపోయారు. ఈ ఘటనపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏలూరు రూరల్ పోలీసులు తెలిపారు.

కొబ్బరికాయల చోరీ ముఠా అరెస్ట్

పాలకొల్లు రూరల్, జూన్ 19 : పాలకొల్లు రూరల్ మండలంలోని పలు కొబ్బరికాయల దుకాణాలలో కురిడీ కాయలను, నీటి పంపు మోటార్లను చోరీ చేసే తొమ్మిది మంది ముఠా సభ్యులను సోమవారం రాత్రి అరెస్టు చేశామని పాలకొల్లు రూరల్ ఎస్ఐ బి.హరికృష్ణ తెలిపారు. గస్తీలో భాగంగా దిగమర్రు బైపాస్‌రోడ్డులో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ఈ తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద ఉన్న 14 నీటి పంపు మోటార్లను, రెండు వ్యాన్లను ఒక లక్షా పదకొండు వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 19 : తన భర్త, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులు, చిత్రహింసలకు గురి చేస్తున్నారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన వసంతాటి వెంకటేశ్వరరావుకు విజయశాంతికు 2005లో వివాహం జరిగిందని వీరికి ఒక కుమార్తె ఉందని తెలిపారు. గత కొంత కాలంగా వెంకటేశ్వరరావు తోపాటు అతడి కుటుంబసభ్యులు అధికకట్నం కోసం ఆమెను మానసి కంగా, శారీరకంగా వేధిస్తున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని స్టేషన్ రైటర్ తెలిపారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

» మరో యువకుడికి తీవ్ర గాయాలు.. పెంటపాడులో ఘటన





కిషోర్‌రెడ్డి(ఫైల్), గాయపడిన మణికంఠరెడ్డి

పెంటపాడు, జూన్ 19 : రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. తాళ్ళముదునూరుపాడుకు చెందిన పులగం కిషోర్‌రెడ్డి (21) తన స్నేహితుడు సత్తి మణికంఠరెడ్డితో పాటు మరో ఇద్దరు స్నేహి తులతో బుధవారం పెంటపాడులోని ఒక వివాహానికి హాజరయ్యేందుకు వచ్చాడు. అనంతరం మోటారుసైకిల్‌పై పెంటపాడు నుంచి తాళ్ళముదునూ రుపాడు వెళ్తుండంగా పెంటపాడు కాలేజ్ సెంటర్‌సమీపంలో తాడేపల్లి గూడెం నుంచి భీమవరం వైపునకు వెళ్తున్న కారును ఢీ కొట్టారు. తీవ్రగాయాలైన కిషోర్‌రెడ్డి, మణికంఠరెడ్డిలను స్థానికులు సత్వరమే ఆటోపై తాడేపల్లిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బైక్ నడుపుతున్న కిషోర్‌రెడ్డి తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెనుక కూర్చున్న మణికంఠరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో అతడికి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. సంఘటనా స్థలాన్ని పెంటపాడు ఎస్ఐ శీలం శంకర్ పరిశీలించారు. మృతుడి సోదరుడు నాగవంశీరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతి చెందిన కిషోర్‌రెడ్డి పెంటపాడు డీఆర్‌జీ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశాడని బంధువులు తెలిపారు. తల్లిదండ్రులకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు హఠాత్తుగా మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరయ్యారు. యువకుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యలమంచిలి, జూన్ 19 : రోడ్డు ప్రమాదానికి గురైన పాలకొల్లు పట్టణానికి చెందిన బెజవాడ నాగేశ్వరరావు(66) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ కె.శివన్నారాయణ తెలిపారు. కొన్నేళ్లుగా పట్టణంలో నివాసం ఉంటున్న ఆయన వ్యవసాయ పనుల నిమిత్తం ఈనెల 17న స్వగ్రామమైన కాంభోట్లపాలెం బైక్‌పై వెళ్తుండగా కట్టుపాలెం ప్రధాన కూడలి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఏలూరులోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ముఠా కూలీ మృతి

ఏలూరు క్రైం, జూన్ 19 : ఊకలారీ లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఏలూరులోని తిలక్‌నగర్‌కు చెందిన గులిపల్లి కోటేశ్వరరావు (42) ముఠా కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 16వ తేదీ రాత్రి సత్రంపాడులో ఊకలారీ లోడు చేస్తుండగా ప్రమాదవశాత్తు లారీపైనుంచి జారిపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతడిని గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు అందగా ఘటనా స్థలాన్ని పరిశీలించి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్రంపాడులో చోరీ

ఏలూరు క్రైం, జూన్ 19 : అపార్టుమెంటులో ఫ్లాట్‌కు తాళం వేసి స్కూలులో ఉన్న పాపను తీసుకువచ్చేలోపు 20 నిమిషాల వ్యవధిలోనే దొంగ ఆ ఇంటి తాళాలు పగులగొట్టి రూ.లక్ష నగదు, బంగారు గొలుసు అపహరించుకుపోయాడు. ఏలూరు సత్రంపాడులోని ఏటీసీ అపార్టుమెంటులో పొల్నూరి సాయిప్రసన్న నివాసం ఉంటున్నారు. ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నారు. ఈనెల 18 తేదీ సాయంత్రం 3.30 గంటలకు స్కూలుకు వెళ్లి పాపను తీసుకుని 3.50 నిమిషాలకు ఇంటికి వచ్చేశారు. ఈలోపు ఫ్లాట్ తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని లక్ష రూపాయల నగదు, మూడు కాసుల బంగారు చైన్ గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరు కాల్వలో లారీ క్లీనర్ గల్లంతు

» కొనసాగిన గాలింపు చర్యలు.. కానరాని ఆచూకీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 19:తాడేపల్లిగూడెం పట్టణంలోని ఏలూరు కాల్వలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ప్రమాదవశాత్తు పడి గల్లంతైన ఘటన బుధవారం జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. పట్టణంలోని గొల్లగూడెంకు చెందిన వి.భైరవస్వామి (42) లారీ క్లీనర్ పనిచేస్తుంటాడు. అతడు మద్యానికి బానిసై మత్తులో ఊగుతూ బుధవారం సాయంత్రం ఏలూరు కాల్వ వంతెన నుంచి కాల్వలోకి పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాల్వలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. రాత్రి చీకటి పడడంతో గాలింపు చర్యలు ఆపి ఉదయాన్నే గాలించనున్నారు. ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయినట్టు అనుమానిస్తున్నామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం/ఉంగుటూరు, జూన్ 19 : ఇనిస్టాగ్రామ్‌లో పదహారేళ్ల యువతిని పరిచయం చేసుకుని మాయమాటలు చెప్పి తన గ్రామానికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన యువతి ఇనిస్టాగ్రామ్ చూస్తుండగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన వరికూటి మధు(21) పరిచయం అయ్యాడు. ఆమెకు మాయమాటలు చెప్పి ఈనెల 18వ తేదీన ఏలూరు కొత్త బస్టాండ్ నుంచి తన గ్రామానికి తీసుకువెళ్ళి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం వరికూటి మధుపై కిడ్నాప్, అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

జంగారెడ్డిగూడెం, జూన్ 19 : బాలిక అదృశ్యం.. లైంగిక దాడి ఘటనలో ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ జ్యోతిబస్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామంలో ఐదో తరగతి వరకు చదివిన బాలిక గత నెల 26వ తేదీన తన తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి తండ్రి లేచి చూసే సరికి బాలిక కనిపించక పోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పి. రాజేష్ తెలిపారు. జీలుగుమిల్లి మండలం టేకూరు గ్రామానికి చెందిన నేరం సందీప్ అలియాస్ గొల్ల సందీప్ బాలికను కిడ్నాప్ చేయడంతో పాటు టేకూరు ఆర్అండ్ఆర్ కాలనీలో ఖాళీగా ఉన్న ఓ ఇంట్లో బాలికను దాచి ఉంచాడన్నారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక ఆచూకీ లభించడంతో బుధవారం నిందితుడు సందీప్‌ను అరెస్ట్ చేసి అతడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

భారీ వర్షం

» గాలులకు రోడ్లపై పడిపోయిన చెట్లకొమ్మలు

» అత్యధికంగా పెనుమంట్రలో 60.2 మిల్లీమీటర్లు

» అత్యల్పంగా తాడేపల్లిగూడెం, పెంటపాడుల్లో 1.2 వర్షపాతం

» పిడుగులు, ఉరుములకు భయపడిన ప్రజలు





భీమవరంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు..
భీమవరంలో పంపుల చెరువుకు వెళ్లే మార్గంలో నీరు

భీమవరం టౌన్/పోలవరం, జూన్ 19 : నాలుగు రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన ఉమ్మడి పశ్చిమ గోదావరి ప్రజలకు బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా వాతావరణం మారి పిడుగులతో పాటు భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. తెల్లవారుజామున చిన్న, చిన్న చినుకులతో ప్రారంభమైన వాన గాలులు, ఉరుములు, పిడుగులతో ఒక్కసారిగా దద్దరిల్లిపోయింది. దాదాపు గంటన్నరపాటు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో అంధకారంలోనే ప్రజలు బిక్కుబిక్కుమంటు గడిపారు. గాలులకు రోడ్లపై చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. డ్రెయిన్లు పొంగిపోర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. తెల్లవారిన తరువాత వర్షం లేకపోవడంతో డ్రెయిన్లు లాగేయడంతో నీటి నిల్వలు అంతగా కనిపించలేదు. భారీ వర్షం కారణంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్రలో 60.2 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదైంది. తాడేపల్లిగూడెం, పెంటపాడులలో 1.2 మిల్లీమీటర్ల అత్యల్ప వర్షంపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో వర్షపాత నమోదు వివరాలివి.. పెనుగొండలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం, ఆచంట-10, పోడూరు-20.6, మొగల్తూరు-3.6, నరసాపురం-4, యలమంచిలి-8.2, గణపవరం-2.4, ఆకివీడు-19.8, ఉండి-4.2, పాలకోడేరు-40.4, వీరవాసరం-47.2, భీమవరం-48.8, కాళ్ళ-7.2, తణుకు-6.2, అత్తిలి-16.4, ఇరగవరం-14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పోలవరంలో జోరువాన..

పోలవరం మండలంలో బుధవారం ఉదయం జోరు వాన కురిసింది. పోలవరం మెయిన్‌రోడ్డులో వర్షపునీరు నిలిచి ప్రజానీకం పలు అవస్థలకు గురయ్యారు. పట్టిసీమ వీరభద్రపురంలో పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉండడంతో వీధుల్లో రోడ్లపై, నివాసాల చుట్టూ నీరు, మురికి నిలిచి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు.

మంత్రి నిమ్మలను కలసిన టీడీపీ నేతలు



మంత్రి నిమ్మల రామానాయుడిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ నేతలు

పాలకొల్లు టౌన్/అర్బన్/గణపవరం, జూన్ 19: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడును మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌తో కలిసి ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు, ద్వారకా తిరుమల శ్రీవారి చిత్రపటాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో మానెం సాయి, మణికంఠ తదితరులు ఉన్నారు. టీడీపీ గణపవరం మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, ఇందుకూరి మారిరాజు, కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, కాపారం చిన్న, పాతపాటి కృష్ణంరాజు తదితరులు నిమ్మలతోపాటు ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజును వారి కార్యాలయాల్లో కలిసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీస్ మంత్రి నిమ్మలను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్‌లో పాలనాపరమైన అంశాలపై ఆర్డీవోతో మంత్రి నిమ్మల చర్చించారు.

కేంద్ర మంత్రి సీతారామన్ దృష్టికి ఆక్వా రంగ సమస్యలు

భీమవరం టౌన్, జూన్ 19 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రాష్ట్ర ఆక్వా ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ యిర్రింకి సూర్యారావు మర్యాద పూర్వకంగా కలిశారు. డిల్లీలో ఉన్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ద్వారా బుధవారం సీతారామన్‌ను కలిసి ఆక్వా సమస్యలపై మాట్లాడారు. టౌన్ ఆఫ్ ఎక్సలెన్సీ నిధుల విషయాన్ని ప్రస్తావించారు. అనంతరం సూర్యారావు, మంత్రి శ్రీనివాసవర్మతో కలసి కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిశారు.

అసైన్డ్ చట్టం ఉల్లంఘనపై ఫిర్యాదు

మొగల్తూరు, జూన్ 19 : మండలంలో పలు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ముందు అసైన్డ్ చట్టాన్ని రెవెన్యూ అధికారులు ఉల్లంఘించినట్టు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి ఫిర్యాదు చేసినట్టు పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన మేళం అశ్వపతి తెలిపారు. పేరుపాలెం, కెపిపాలెం, ముత్యాలపల్లి, కొత్తోట గ్రామాల్లో అసైన్డ్ భూములను ఎన్నికల ముందు విధులు నిర్వహించిన మండల స్థాయి రెవెన్యూ అధికారులు ఎకరాకు రూ.40 వేలు వరకూ చేతివాటం ప్రదర్శించి ఆ భూములు ప్రస్తుత అనుభవదారుల పేరుపై మార్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరానని అశ్వపతి విలేకరులకు తెలిపారు.

తాగు నీరందక ప్రజలు ఇబ్బందులు

మొగల్తూరు, జూన్ 19 : మొగల్తూరు పంచాయతీ వడయార్ పేటలో కొన్ని రోజులుగా తాగు నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు బృహత్తర మంచినీటి ప్రాజెక్టు నుంచి నిత్యం గ్రామానికి తాగునీరు సరఫరా అవుతోంది. ఇటీవల కొన్ని రోజుల నుంచి సక్రమంగా నీటిని సరఫరా చేయడం లేదు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ మోహనరావును వివరణ కోరగా నీటి సరఫరాలో కొన్ని సాంకేతిక సమస్యలు వచ్చాయని రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి పూర్తిస్థాయిలో నీరు అందిస్తామన్నారు.

ధాన్యం సొమ్ములు చెల్లించండి

ఆచంట, జూన్ 19 : ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్న ఇంత వరకు సొమ్ములు చెల్లించకపోవడం దురదృష్టకరమని సీపీఎం సీనియర్ నాయకులు తలుపూరి బుల్లిబ్బాయి అన్నారు. కౌలు, పేద రైతులకు తక్షణమే ధాన్యం బకాయిలు చెల్లించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఐవీశెట్టికి వినతిపత్రం అందజేశారు. మండల కమిటీ సభ్యులు సిర్రా నర్శింహమూర్తి, గుత్తుల రంగారావు, పి.మోహనరావు, కుసుమే జయరాజు, తోటపల్లి సత్యనారాయణ, కొండేటి రాఘవులు పాల్గొన్నారు.

డ్రైన్ల ఆక్రమణలను తొలగించాలి



మోస్తరు వర్షానికి జాతీయ రహదారిపై నిలిచిన నీరు

ఆకివీడు, జూన్ 19: పట్టణ పరిధిలో డ్రైన్లు ఆక్రమణకు గురై పూడుకుపోవడంతో చిన్నపాటి వర్షానికే ముంపు బారిన పడుతోంది. గతంలో స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి ఎఫ్‌సీఐ వరకూ ప్రపంచ బ్యాంకు నిధులతో జాతీయ రహదారికి ఇరువైపుల డ్రైను తవ్వించారు. అయితే ఆ డ్రైను పూర్తిగా ఆక్రమణకు గురై పూడుకుపోవడంతో జాతీయ రహదారిపై నీరు నిలుస్తుండడమే కాకుండా రహదారి దెబ్బ తింటున్నది. నగర పంచాయతీ పరిధిలో అందేవారి, గంగానమ్మకోడ్, మూలలంక మురుగు బోదెలు ఆక్రమణకు గురై పూడుకుపోవడంతో చిన్నపాటి వర్షానికి రోడ్లు చెరువులు, కాలువలను తలపిస్తున్నాయి. పాలకులు, అధికారులు ఈ సమస్యలు పరిష్కరించకపోతే వర్షాకాలం చాలా సమస్యలు చవిచూడాల్సి వస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పొన్నమండకు ఘన నివాళి

నరసాపురం టౌన్, జూన్ 19: టీడీపీ సీనియర్ నాయకులు పొన్నమండ నాగేశ్వరరావు సంతాప సభ పట్టణంలోని ఆయన నివాసం వద్ద బుధవారం నిర్వహించగా టీడీపీ ఇంచార్జి పొత్తూరి రామరాజు విచ్చేశారు. పొన్నమండ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కం శ్రీమన్నారాయణ, బర్రె ప్రసాద్, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

మోటూరు 23వ వర్ధంతి సభ

భీమవరం అర్బన్, జూన్ 19 : మోటూరు హనుమంతరావు 23వ వర్ధంతి సభ భీమవరం సీపీఎం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యులుగా, ప్రజాశక్తి సంపాదకులుగా పని చేశారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం పాల్గొన్నారు.

చిన్నారులకు, బాలింతలకు నాణ్యమైన సేవలు అందించండి

కలెక్టర్ సుమిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

భీమవరం టౌన్, జూన్ 19 : చిన్నారులు, గర్భిణు లకు, బాలింతలకు అందించే సేవలు నాణ్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వశిష్ట సమావేశ మందిరంలో బుధవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో క్షేత్ర స్థాయిలో వారు అందజేస్తున్న సేవలుపై ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీలోని చిన్నారులలో ఎత్తు, బరువు తక్కువ గా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తరచూ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు క్షేత్ర స్థాయిలో సందర్శించి చిన్నారులకు అందుతున్న సేవలను రికా ర్డుల్లో నమోదు చేయాలన్నారు. తదుపరి సమావేశం లో క్షుణ్ణంగా సమీక్షించడం జరుగుతుందని ఖచ్చిత మైన సంఖ్యలను మాత్రమే నమోదు చేయాలన్నారు. అంగన్వాడీలో పిల్లలకు నేర్పించే విషయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రక్తహీనతపై తీసుకోవాల్సిన మందులు, పోషకాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. సీడీపీఓలు సంక్షిప్త సమాచారాన్ని తయారు చేసుకుని శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ వర్కు‌కు, హెల్పర్లకు ఎటువంటి శిక్షణ ఇవ్వాల్సో ఆలోచన చేయాలని తెలిపారు. ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే పీహెచ్‌సీలతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. శిశు, ప్రసూతి మరణాలు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ అధికారి బి.సుజాత రాణి, తదితరులు పాల్గొన్నారు.

బీపీహెచ్‌యూల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయండి

భీమవరం టౌన్, జూన్ 19 : జిల్లాలో చేపట్టిన బీపీహెచ్‌యూ (బ్లాక్ పబ్లిక్ హెల్త్‌యూనిట్) నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలె క్టర్ ఛాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ, రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో యండగండి, పోడూరు, బీపీహెచ్‌యూలు స్లాబ్ దశలో ఉన్నాయని, అత్తిలిలో నిర్మాణం ప్రారంభ మైందని, ఎల్‌బీ చర్ల, డొడ్డిపట్లలలో నిర్మాణాలను ప్రారంభించాల్సి ఉందని అధికారులు వివరించారు. నిర్మాణంలో ఉన్నవి వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే నిర్మాణాలు చేపట్టాల్సిన రెండు యూనిట్ల నిర్మాణాలకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కింద నిర్మాణాలను చేపట్టామని నిధులు కొరత లేదని ఈ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, రోడ్లు భవనాల శాఖ అధికారి లోకేశ్వరరావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను సందర్శించిన మంత్రి నిమ్మల



కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్, 19 : టిడ్కో ఇళ్లను ఇరిగేషన్ శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి లబ్ధిదారులు ఘన స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి నిమ్మల టిడ్కో గృహాల సముదాయాలను సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ కాలనీలో దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జనసేన జిల్లా కార్యదర్శి బోనం చినబాబు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, జిల్లా టీడీపీ కార్యదర్శి బందెల భాస్కరరావు మంత్రి నిమ్మల వెంట ఉన్నారు.



భీమవరంలో కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ బాపిరాజు

రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

భీమవరం అర్బన్, జూన్ 19: స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇంచార్జి అంకెం సీతారామ్ ఆధ్వర్యంలో బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రానున్న రోజుల్లో దేశానికి ప్రధాని కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని మాజీ ఎంపీ, టీటీడీ చైర్మన్ కనుమురి బాపిరాజు, సీతారాం అన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు బ్రెడ్, బట్టర్ మిల్క్, పండ్లు పంచారు. అలాగే ఏపీ పీసీసీ సభ్యులు అద్దంకి దోర బాబు ఆధ్వర్యంలో వీరమ్మ పార్కు వద్ద కేకు కట్ చేశారు. పార్టీ మహిళా అధ్యక్షురాలు సోడదాసి సెల్వియా, నాయకులు జేఎస్ ఆర్, మద్దాల సాయి, సోము నాగ కేశవ్‌బాబు పాల్గొన్నారు.

- ఉండి : ఉండిలో రాహుల్ గాంధీ జన్మదినం వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. పేదలకు మామిడి పండ్లను పంచారు. మాజీ మంత్రి, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరు బాపిరాజు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వేగేశ్న గోపాల కృష్ణంరాజు, నాయకులు జంపన సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.
- పాలకొల్లు అర్బన్ : పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ అధ్యక్షతన రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. పార్టీ అభ్యర్థి కొలుకులూరి అర్జునరావు, యలమంచిలి, పోడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోడి మోహన్‌రావు, బొలిశెట్టి భాను ప్రకాష్, వర్దనపు కాసు తదితరులు పాల్గొన్నారు.

యోగా శిక్షణపై రేపు అవగాహన సదస్సు

ఆకివీడు, జూన్ 19: యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న స్థానిక కేంద్రంలో యోగా పై శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని పతంజలి యోగారోగ్య కేంద్రం వ్యవస్థాపకుడు డాక్టర్ బలరామ్ ప్రతాప్‌కుమార్ బుధవారం తెలిపారు. ధ్యానరత్న ఉండ్రమట్ల సాంబశివరావు, తదితరులున్నారు.

ప్రజలు, రైతుల భాగస్వామ్యంతో అభివృద్ధి



ఎమ్మెల్యే రఘురామను కలిసి అభినందనలు తెలుపుతున్న డ్వాక్రా యానిమేటర్లు, సిబ్బంది

కాళ్ల(ఉండి), జూన్ 19 : ప్రజలు, రైతుల భాగస్వామ్యంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పానికి అనూహ్యస్పందన వస్తోందని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్, తాను ఉమ్మడి ఆలోచనలతో చేపట్టిన 'డ్రైనేజీ మెయింటెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఉండి' అనే కార్యక్రమానికి ఊహించిన దానికంటే ఎక్కువగా స్పందన లభించిందన్నారు. ఈ ఫండ్ కింద తాను అక్కౌంట్ ప్రారంభించి రూ.ఐదు లక్షల చెక్కును జమ చేశానన్నారు. ప్రస్తుతం ఈ అక్కౌంట్‌లో ఎవరైనా ఆర్థిక సాయాన్ని అందజేయవచ్చన్నారు. రెండు గ్రామాలలో డ్రైన్ల పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలపారు.

- ఉండి : రైతులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కాలువలు డ్రైన్ల ప్రక్షాలన పనులను చేపట్టి పూర్తి చేయాలని ఇనిగేషన్, డ్రైనేజీ అధికారులకు ఎమ్మెల్యే రఘురామ ఆదేశించారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రఘురామను కలిసిన డ్వాక్రా యానిమేటర్లు

ఉండి మండలానికి చెందిన డ్వాక్రా యానిమేటర్లు, సిబ్బంది, మహిళలు పెదఅమిరంలోని ఎమ్మెల్యే కార్యాలయానికి బుధవారం వెళ్లి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణంరాజుకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

డీఎంఅండ్‌హెచ్‌వో ఉమామహేశ్వరరావు



ఉండి ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్‌వో

ఉండి, జూన్ 19: సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్ హెచ్‌వో డి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఉండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ డాక్టర్ లక్ష్మిసునంద అధ్యక్షత వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎనిమియా వ్యాధికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా ట్రైబెల్ అధికారి భావన, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

- పాలకోడేరు : సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంగం నాయుడు సూచించారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ వెంగం నాయుడు మాట్లాడుతూ ఈ వ్యాధి వారసత్వంగా సక్రమిస్తుందన్నారు. పీహెచ్‌సీలో రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని, సీహెచ్‌ఓ సత్యనారాయణ, పీహెచ్‌ఎన్ కుమారి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.
- గణపవరం, జూన్ 19: పిప్పర గ్రామంలో ప్రభుత్వ వైద్యాధికారి కె.ప్రియాంక ఆధ్వర్యంలో ప్రపంచ సికిల్‌సెల్ ఎనిమియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. గణపవరంలో జరిగిన ప్రపంచ సికిల్‌సెల్ ఎనిమియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌వో విల్సన్‌బాబు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



నరసాపురం రూరల్, జూన్ 19: వైఎస్ పాలెంలో కొలువైన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి 14వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామి కల్యాణం నిర్వహించారు. వైఎస్ మోహన్‌రావు, కూనపరెడ్డి చంటి, సర్పంచ్ యర్రంశెట్టి నాగముత్యామాంబ దంపతులు స్వామి కల్యాణం జరిపించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

విద్యా గణపతికి గరిక పూజ

భీమవరం టౌన్ : గునుపూడిలోని శ్రీవిద్య గణపతి ఆలయంలో స్వామివారికి సహస్ర గరిక పూజ నిర్వహించారు. రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారి అభిమానులు వేలూరి బుజ్జి ఆధ్వర్యంలో స్వామి పంచామృతాలతో అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మజ్యోసుల ప్రసాద్, మైలవరపు మణికంఠ, బొల్లా ప్రగడ శేషు, అలయ కమిటీ అధ్యక్షుడు వేలూరి కిరణ్, కార్యదర్శి మారెళ్ల అఖిలేష్ సభ్యులు పాల్గొన్నారు.

ఈడూరులో సుదర్శన హోమం

అత్తిలి : ఈడూరులోని వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా కలిదిండి రంగరాజు దంపతులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పవన్‌కు అభినందన



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రిగా అమరావతిలో బాధ్యతలు స్వీకరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న జనసేన పార్టీ ప్రొటోకాల్ రాష్ట్ర చైర్మన్ మల్లినీడి తిరుమలరావు

మావుళ్ళమ్మ బంగారు చీరకు సహకరించండి



మంత్రి శ్రీనివాస్‌ను సత్కరించిన ఎమ్మెల్యే పులపర్తి

భీమవరం టౌన్, జూన్ 19 : మావుళ్ళమ్మవారికి బంగారు చీరకు మీ సహకారం కావాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కోరారు. మంత్రి శ్రీనివాస్‌ను బుధవారం భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని ఎమ్మెల్యే అంజిబాబు, వారి కుమారుడు ప్రశాంత్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు (చినబాబు) సత్కరించారు. మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం అభివృద్ధికి కలిసి పని చేద్దామన్నారు జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, సరిపిడకల రామారావు, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, రెడ్డి సత్తిబాబు, కొప్పినిడి శ్రీను, చెల్లబోయిన గోవింద్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్‌ను భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్‌ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణమూర్తి, వెస్టబెర్రీ డైరెక్టర్ నడింపల్లి మహేష్ ఘనంగా సత్కరించారు.

మంత్రి సవితను కలిసిన టీడీపీ నేతలు



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గౌరునాయుడు, తదితరులు

పాలకొల్లు టౌన్, జూన్, 19 : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవితను పాలకొల్లుకు చెందిన జిల్లా టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు అమరావతిలోని మంగళగిరిలోని ఆమె క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి పుష్పగుచ్చం అందచేసి అభినందనలు తెలిపారు. పాలకొల్లు టౌన్ బీసీ సెల్ అధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్, బాబులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు అభినందనీయం

ఆచంట, జూన్ 19 : విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పునరుద్ధరించడం అభినందనీయమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. గత ప్రభుత్వం విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగనన్న విదేశీ విద్య నిధి పేరుగా మార్పు చేయడంతో దళిత, ప్రజా సంఘాలు వ్యతిరేకించినా మాజీ సీఎం జగన్ స్పందించలేదన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ నిధులు నూరు శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- ఆచంట : విదేశీ విద్యా విధానానికి సీఎం చంద్రబాబు అంబేద్కర్ పేరు కొనసాగించాలని జీవో విడుదల చేయడంపై మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ తమ హర్షం వ్యక్తం చేశారు.

జన సైనికుల సంబరాలు



కేక్ కట్ చేసి జనసైనికుల సంబరాలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 19: నీతివంతమైన పాలన అందించేందుకే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారని జనసేన నాయకుడు అడబాల నారాయణ మూర్తి అన్నారు. డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా బుధవారం పట్టణం లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నా రు. వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, సజ్జా సుబ్బు, కేశవభట్ల విజయ్, చేపల రమేష్, ముఖేష్ పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెన్మెత్స

ఉండి, జూన్ 19: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెన్మెత్స సత్యనారాయణరాజు నియమించినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పాండువ్వ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఆయన పని చేస్తున్నారు. పలువురు ఉపాధ్యాయులు సత్యనారాయణరాజుకు అభినందనలు తెలిపారు.

శ్మశాన స్థలం యథావిధిగా ఉంచండి

పాలకోడేరు, జూన్ 19: గ్రామ శివారు పంతొట్టి వద్ద వివాదస్పదంగా మారిన శ్మశాన స్థలం వద్ద ఇరువర్గాలతో తహసీల్దార్ నాగార్జున, ఎస్సై నాళం శ్రీనివాసరావు బుధవారం చర్చలు జరిపారు. పంతొట్టి వద్ద ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో పూర్వీకుల నుంచి ఉంటున్న వీరి నివాసానికి చేర్చి శ్మశాన వాటిక ఉంది. కొన్ని రోజుల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది ఇళ్ల మధ్య నుంచి రోడ్డు వేసి గృహాలు తొలగించే విధంగా హడావిడి చేశారు. దీంతో ఆ ప్రాంతానికి చెందిన కొంత మంది కలెక్టర్ వద్దకు వెళ్లి తమకు రక్షణ కల్పించాలని వేడుకోవడంతో కలెక్టర్ తహసీల్దార్‌కు సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో వర్గాల వారితో చర్చలు జరిపి కొత్తగా ఆ ప్రాంతంలో ఎటువంటి పనులు చేపట్టరాదని ఇప్పటి వరకు ఎలా ఉందో అలానే ఉంచాలని ఆదేశించారు. అదే విధంగా ఆ రహదారిని ఎవరు నిర్మించారో దానిని పంచాయతీ నుంచి అనుమతులు ఎవరు ఇచ్చారన్న దానిమీద పంచాయతీకి, ఈఓఆర్‌డీకి ఆదేశాలు జారీ చేస్తారని తెలిపారు. ఆర్ఐ నాగభూషనరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

190 మందికి వైద్య పరీక్షలు

పెనుగొండ, జూన్ 19 : తేతలి వారి వీధిలో బుధవారం బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో డాక్టర్ సత్యనారాయణ 190 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా చేయాలి

నరసాపురం రూరల్, జూన్ 19: గ్రామాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సమగ్ర సర్వే చేయాలని ఎంపీడీవో రమణరావు అదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయి, ఎన్ని నిర్మించాలన్న దానిపై గ్రామాల వారీగా సర్వే చేసి నివేదికను అందించాలన్నారు. సర్వేలో లోపాలుంటే ఆధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు.

శెట్టి బలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



పెనుగొండ, జూన్ 19 : ములపర్రు గ్రామ శెట్టిబలిజ సంఘం నూతన అధ్యక్షుడిగా కడలి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ఉన్న ఆరు శెట్టిబలిజ సంఘాలు కలిసి గ్రామ సంఘంగా ఏర్పడి అధ్యక్షునిగా కడలి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడుగా గుడాల లోకేశ్వరరావు, సెక్రటరీ కట్టా రామకృష్ణ, మొత్తం 12 మంది సభ్యులును ఎన్నుకున్నారు.

పాఠశాల విద్యార్థులకు కిట్లు పంపిణీ



ఆచంటలో కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

ఆచంట, జూన్ 19 : వల్లూరు, భీమలాపురం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, కిట్‌లు పంపిణీ చేశారు. ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, వైస్ సర్పంచ్‌లు, బీజేపీ నాయకులు, హెచ్‌ఎం పాల్గొన్నారు.

- నరసాపురం టౌన్ :పట్టణంలోని చినమామి డిపల్లి స్కూల్ విద్యార్థులకు ఛైర్ పర్సన్ వెంకట రమ ణ పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం బి.సూర్య కుమారి, కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, ఆర్‌ఆర్‌కే రాజు, బళ్ల నాగవెంకటేశ్వర్లు, బళ్ళ తాతాజీ పాల్గొన్నారు.
- ఉండి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేశారు. తెలు గు యువత అధ్యక్షుడు చెన్నంశెట్టి హరినాయుడు, ఎంపీటీఈ కునుకు రమాదేవిశ్రీను, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాగిత బుజ్జి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కాగిత మహంకాళి, కమతం బెనర్జి, ముదునూరి కృష్ణంరాజు, గొల్లవిక్టర్‌బాబు పాల్గొన్నారు.
- కాళ్ల(ఉండి) : కోపల్లె మండల పరిషత్ మెయి న్ పాఠశాల విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం, నాయకులు పాల్గొన్నారు.
- పాలకోడేరు : గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సర్పంచ్ కుక్కల లక్ష్మీ అధ్యక్షతన విద్యా ర్థులకు టీడీపీ నాయకులు కిట్‌లు అందజే శారు. టీడీపీ నాయకులు కమ్మిలి రాంబాబు, కామాన రాంబాబు, గాదిరాజు సూర్యనారాయణరాజు, జనసేన నాయకులు మండలి ప్రసాద్ వార్డు సభ్యుడు సంబ లదీవి వెంకటేశ్వరరావు, బోసు రాజు, నరసింహరాజు, సారా మల్లేశ్వరరావు, ఏసురత్నం పాల్గొన్నారు.
- మొగల్తూరు : కోట వద్ద ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ పడవల మేరీ, వార్డు సభ్యుడు యర్రమిల్ల గణపతి, పడవల సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు కెఎస్‌వి సుజాత పాల్గొన్నారు.
- తణుకు : పట్టణంలోని నంబర్ వన్ బోర్డు స్కూలులో విద్యార్థులకు కిట్‌లు అందజేశారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిట్టూరి స్వర్ణలత, హెచ్ ఎం రుద్రమదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పైడిపర్రు జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం ఏడుకొండలు అధ్యక్షతన కిట్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు ఒంటెద్దు రాజా, ములగాల శ్రీనివాసు, మోపిదేవి శివ, మారిశెట్టి మురళీ తదితరులు పాల్గొన్నారు.
- పెనుమంట్ర : పాలమూరు, ఓడూరు పాఠశాలల విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేశారు. మాజీ సర్పంచి చింతపల్లి రామకృష్ణ, హెచ్‌ఎం బీడీ సరస్వతి, టీడీపీ అధ్యక్షుడు పెనుమెత్స వివేక రాఘవేంద్ర రాజు, ఓడూరు గ్రామ అధ్యక్షుడు ఇందుకురి సుబ్బరాజు, ఉపాధ్యక్షుడు ఇందుకూరు సాయి సుబ్బరాజు. పార్టీ నాయకులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.